గరిష్ఠం/కనిష్ఠం
31.0 / 18.0

వాతావరణం
చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. అర్ధరాత్రి దాటిన తర్వాత మంచు కురుస్తుంది. చల్లటి గాలులు వీస్తాయి.



- రద్దీగా మారిన బేకరీలు, మిఠాయి దుకాణాలు
- మద్యం షాపుల వద్ద మందుబాబుల బారులు
- ముమ్మరంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
- రోడ్లపైనే కేక్‌ల విక్రయాలు

నూతనోత్సాహం


జిల్లాకేంద్రంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొంటున్న ఓ కుటుంబం

వనపర్తిటౌన్/ఆత్మకూర్: జిల్లాలో నూతన సంవత్సర వేడుకల సందడి మంగళవారం రాత్రి నుంచే కనిపించింది. పట్టణాల్లోని బేకరీలు, మిఠాయి దుకాణాలతో పాటు మద్యం, మాంసం దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. చిన్నా, పెద్దా తేడా లేకుండా కేక్‌లు కొనుగోలు చేశారు. ఇదిలా ఉండగా కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు ఇళ్ల ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసేందుకు మహిళలు, యువతులు కలర్లు కొనుగోలు చేయడం కనిపించింది. దుకాణాలతో పాటు చిరువ్యాపారులు రహదారుల పక్కన రంగుల ముగ్గులు విక్రయించారు.

పోలీసుల ఆంక్షలు..

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఇళ్లలోనే జరుపుకోవాలని, మద్యం తాగి రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు ముందుగానే హెచ్చరించారు. వేడుకల సందర్భంగా పలు ఆంక్షలు విధించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక బృందాలతో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.

■ జిల్లాకేంద్రంలోని బాలభవన్‌లో ఉమెన్స్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఉచిత కంప్యూటర్ శిక్షణకు హాజరైన మహిళలంతా కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సొసైటీ అధ్యక్షురాలు హసీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

■ ఆత్మకూర్‌లోని డిగ్రీ కళాశాలలోనూ విద్యార్థులు ముందస్తు వేడుకలు జరుపుకొన్నారు.



వనపర్తిలో డ్యాన్సు చేస్తున్న మహిళలు.. ఆత్మకూర్‌లో పోలీసుల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

న్యూస్‌రీల్

4న ఉప ముఖ్యమంత్రి రాక

వనపర్తి: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకుగాను ఈ నెల 4న శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వస్తున్నట్లు మంగళవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రేవల్లి మండలం తల్పునూరుగోపాల్‌పేట మండలం ఏదుట్లలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రారంభించిన అనంతరం గోపాల్‌పేటలో జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి, ఎంపీ డా. మల్లు రవి, సాట్ చైర్మన్ కె.శివసేనారెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

యూనియన్ బ్యాంక్‌ను సందర్శించిన ఎస్పీ



అమరచింత: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకును మంగళవారం ఎస్పీ రావుల గిరిధర్ మంగళవారం సందర్శించారు. బ్యాంకులో సోమవారం జరిగిన చోరీ విఫల యత్నం, పరిసరాలను పరిశీలించారు. లోనికి, స్ట్రాంగ్ రూంలోకి ఎలా వెళ్లారు.. కిటికీని ఎలా తొలగించారు.. సీసీ కెమెరాల తీగల తొలగింపును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కేసు పురోగతి గురించి సీఐ శివకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. నిఘా పెంచాలని, నేరస్తులను త్వరగా గుర్తించాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆయన వెంట సీసీఎస్ సీఐ రాంపాల్, ఎస్‌ఐలు జయన్న, సురేశ్ ఉన్నారు.

రైల్వే పనులకు సహకరించండి : ఆర్డీఓ



ఆత్మకూర్: రైల్వే అభివృద్ధి పనులకు రైతులు సహకరించాలని, భూ సేకరణ అనంతరం పరిహారం అందుతుందని ఆర్డీఓ సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం మండలంలోని దేవరపల్లి, ఆరేపల్లిలో రెవెన్యూ, రైల్వే అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్–డోన్ డబ్లింగ్ పనులు కొనసాగుతున్నాయని ఆయా గ్రామాల్లో రైల్వే వంతెనల నిర్మాణానికి భూ సేకరణ చేపడుతున్నామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ చాంద్‌పాషా, ఆర్‌ఐ ఆసీఫ్, సర్వేయర్ రామకృష్ణ, రైల్వే అధికారులు, రైతులు ఉన్నారు.

వినూత్న ఆలోచనలు.. ఉన్నత లక్ష్యాలు


'సాక్షి' చర్చాగోష్టిలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

- ఉన్నత చదువులతోనే అత్యున్నత శిఖరాలకు...
- ఆత్మకూర్ వికాస్ డిగ్రీ కళాశాలలో 'సాక్షి' చర్చాగోష్టి
- అభిప్రాయాలను పంచుకున్న పలువురు విద్యార్థులు

వనపర్తి/ఆత్మకూర్: నూతన సంవత్సరం కొత్త ఆశలను మోసుకొస్తుంది. కొత్త ఏడాదిలో తమ ముందున్న లక్ష్యాలు, ఉన్నత విద్య, భవిష్యత్ ప్రణాళిక తదితర అంశాల గురించి మంగళవారం ఆత్మకూర్ వికాస్ డిగ్రీ కళాశాలలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా గోష్టిలో పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొని వారి అభిరుచులకు అనుగుణంగా సలహాలు, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యతోనే విజ్ఞానం సిద్ధిస్తుందని విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి అత్యున్నత జీవిత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సంపాదించిన ఆస్తులు, బంగారం, డబ్బును పోగొట్టుకోవచ్చేమోగానీ.. నేర్చుకున్న జ్ఞానాన్ని ఎవరూ దొంగిలించలేరని తెలిపారు. విద్యతో సాధించిన విజ్ఞానంతో సమాజంలో ఎక్కడైనా స్వశక్తితో గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించవచ్చని సూచించారు. విద్యార్థి జీవితంలో కొత్తదనం, అన్వేషణలకు సమయం ఎలా ఇవ్వాలి, భవిష్యత్ ప్రణాళికలను ఎలా తయారు చేసుకోవాలి, జీవితంలో గెలుపునకు చేయాల్సిన కృషి, అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు ఉండాల్సిన పట్టుదల తదితర అంశాలపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. లక్ష్య సాధనకు సముచిత మార్గాలను మాత్రమే ఎంచుకోవాలని.. అప్పుడు సాధించిన విజయం మీకు జీవితంలో సత్ఫలితాలిస్తుందని చెప్పారు. తాము చదువుకునే సమయంలో ఇప్పుడున్నంతగా సౌకర్యాలు లేవని, ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నామని తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.

స్వశక్తితో ఎదగాలని..



డిగ్రీ తర్వాత ఎంబీఏ చదివి స్వశక్తితో జీవించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నా. ఆ దిశగా ముందుకుసాగేందుకు ప్రణాళిక తయారు చేసుకున్నా. నా చదువుకు కుటుంబ సభ్యులు సైతం సహకరిస్తున్నారు. సంపాదన ఒక్కటే కాకుండా సమాజ హితానికి కృషి చేస్తా. వ్యాపార రంగంలో నాకంటూ ఓ ప్రత్యేకత ఉండాలనే కోరిక ఉంది.

– నందిని, బీఎస్సీ, తృతీయ సంవత్సరం

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం..



నా చదువును కుటుంబ ఆర్థిక సమస్యల నడుమ కొనసాగిస్తున్నా. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేదే నా లక్ష్యం. జీవితంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కుటుంబానికి భరోసాగా నిలిచి చెల్లిని ఉన్నత చదువు చదివించాలని ఉంది. పేదలందరికి విద్య అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తా.

– జ్యోతి, బీఎస్సీ తృతీయ సంవత్సరం

అధ్యాపకురాలిని కావాలని ఉంది..



నేటి విద్యార్థులే రేపటి పౌరులు. విద్యార్థులను తీర్చిదిద్దే అత్యుత్తమ వృత్తిగా ఉపాధ్యాయ వృత్తిని భావిస్తా. పీజీ చేసి అధ్యాపకురాలిగా స్థిరపడాలనేదే నా ఆశయం. అందుకోసం పట్టుదలతో చదువుతున్నా. విద్యార్థులకు సరైన దిశానిర్దేశం చేస్తూ.. వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తా.

– హరిని, బీఎస్సీ తృతీయ సంవత్సరం

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు..



వనపర్తి జిల్లాకు చెందిన బ్యాంకు ఉద్యోగి నేడు ఎస్‌బీఐ చైర్మన్ స్థానంలో ఉన్నార. నిజాయితీ, పట్టుదల, అంకిత భావంతో పనిచేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పేందుకు ఆయన జీవితమే ఓ ఉదాహరణ. ఆయనను ఆదర్శంగా తీసుకొని బ్యాంకు ఉద్యోగం సాధించాలనేది నా లక్ష్యం. డిగ్రీ పూర్తిచేసిన వెంటనే బ్యాంకు కోచింగ్ వెళ్తాను.

– సల్మా షేక్, బీఎస్సీ తృతీయ సంవత్సరం

ఉన్నత ఉద్యోగమే ఆశయం..



ఉన్నతమైన ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా చదుతున్నా. అధ్యాపకుల సూచనలు పాటిస్తూ పత్రికల్లో వచ్చిన పలువురి విజయగాథలను చదువుతాను. వారిలా గొప్ప ఉద్యోగం సాధించి పుట్టిన ఊరు, కుటుంబ సభ్యులకు మంచిపేరు తీసుకురావాలని ఉంది. అందుకోసం ఎంత కష్టమైనా భరించి లక్ష్యసాధన కోసం కృషి చేస్తా.

– సానియా, బీఎస్సీ తృతీయ సంవత్సరం

సాంకేతిక రంగంలో రాణిస్తా



సాఫ్ట్‌వేర్ రంగంలో సరికొత్త రికార్డులను సృష్టించాలనేదే లక్ష్యం. ప్రస్తుతం కొనసాగుతున్న ట్రెండ్ కంటే అడ్వాన్స్‌గా ఉండే మొబైల్ యాప్‌లను తయారు చేసి ప్రపంచాన్ని అరచేతిలోకి తీసుకురావాలని ఉంది. అడ్వాన్స్ ఫీచర్లతో కూడిన యాప్‌లను తయారు చేసేందుకు కృషి చేస్తా.

– లక్ష్మీకాంత్, బీఎస్సీ తృతీయ సంవత్సరం

అశాస్త్రీయ సాగుతోనే మామిడి రైతులకు నష్టం

వీపనగండ్ల: అశాస్త్రీయ సాగు విధానాలు అవలంబించడంతోనే మామిడి రైతులు నష్టపోతున్నారని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో మామిడిలో 'సస్యరక్షణ చర్యలు.. చీడపీడల నివారణ' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. పూత త్వరగా రావాలని కల్తార్ అనే రసాయనాన్ని అధిక శాతంలో వినియోగిస్తున్నారని.. దీంతో తేనెమంచు తెగులు, క్రిమి కీటకాలు వృద్ధి చెంది నష్టం కలిగిస్తున్నాయని వివరించారు. మార్చి, ఏప్రిల్‌లో తోటలకు నీరందించే వసతులు ఉంటేనే పెట్టుబడి పెట్టాలని రైతులకు సూచించారు. ఇప్పటికే 50 శాతం పూత వచ్చిన తోటలకు తేలికపాటి నీటి తడులు అందించాలన్నారు. వచ్చిన పూతల్లో 98 శాతం మగ, రెండు శాతం ద్విలింగ పూతలు ఉంటాయని, ఉద్యాన అధికారుల సూచనలు పాటించి మందులు పిచికారీ చేయాలని తెలిపారు. ఎకరాకు రూ.25 వేలు ఖర్చు చేస్తే 3 టన్నుల వరకు దిగుబడి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా ఉద్యాన అధికారి సురేష్, మండల ఉద్యాన అధికారి కృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.


మామిడి రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త సురేష్‌కుమార్

పంటమార్పిడితోనే అధిక దిగుబడులు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌నాయక్

వీపనగండ్ల: రైతులు పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్‌నాయక్ సూచించారు. మంగళవారం మండలంలో పర్యటించి పంటల సాగు వివరాల నమోదు పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతువేదికలో 'పుట్ట గొడుగుల పెంపకం.. కలిగే ప్రయోజనాలు' అనే అంశంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. సేంద్రియ సాగుతో అనేక ప్రయోజనాలు ఉంటాయని.. వరి కొయ్యలను తగలబెట్టడంతో అందులో ఉండే ఉపయోగకర సూక్ష్మజీవులు మరణిస్తాయని వివరించారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకే పురుగు మందులను పిచికారీ చేయాలని, దుకాణదారుల మాటలు నమ్మి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్, ఏఈఓ రజిత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌రంగ ప్రైవేటీకరణ సరికాదు : సీఐటీయూ

వనపర్తి రూరల్: విద్యుత్‌రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, చండీగఢ్ విద్యుత్ కార్మికులపై ఎస్మా ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు కోరారు. విద్యుత్ సంఘీభావ దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలో మంగళవారం వనపర్తి సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణలోని డిస్కంలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయని.. దాదాపు అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం, పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్లను గంపగుత్తాగా ఓట్‌సోర్సింగ్ చేయమని ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. విద్యుదుత్పత్తి, ట్రాన్స్‌మిషన్, పంపిణీ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించొద్దన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లు–2022 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి ఏర్పడిన మోదీ ప్రభుత్వం గతంలో కన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలను అవలంబిస్తోందని చెప్పారు. విద్యుత్‌రంగ పరిరక్షణకు పోరాడుతున్న కార్మికులు, ఇంజినీర్లకు మద్దతుగా నిలబడాలని, దేశవ్యాప్తంగా సంఘీభావం ప్రకటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నందిమళ్ల రాములు, సాయిలు, గిరిబాబు, రాములు ,రాంచందర్, రామకృష్ణ, బాలస్వామి, కడుకుంట్ల రాములు, నాగేషు, రమేష్ ,నాగన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు





క్లుప్తంగా

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం



వెంకట్రాముడు(ఫైల్)

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై కారు ఢీకొని ఓద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలైన సంఘటన మంగళవారం కోదండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ స్వాతి తెలిపిన వివరాలు.. మండలంలోని పుటాన్‌దొడ్డికి చెందిన మందా వెంకట్రాముడు తన బైక్‌పై పని నిమిత్తం మానవపాడు మండలంలోని నారాయణపురం గ్రామానికి వెళ్తున్నాడు. జాతీయ రహదారిపై నారాయణపురం స్టేజీలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య శేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న బైక్

- యువకుడి దుర్మరణం

అచ్చంపేట రూరల్: ఆగి ఉన్న టిప్పర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు(23) దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి అచ్చంపేట సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. అచ్చంపేటలోని వెంకటేశ్వర్‌నగర్ కాలనీకి చెందిన వెంకట్‌రెడ్డి, సరస్వతి దంపతుల కుమారుడు రాఘవేందర్‌రెడ్డి. మంగళవారం ఉదయం పని నిమిత్తం అతడు బైక్‌పై కల్వకుర్తికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అచ్చంపేట మండలం నడింపల్లి సమీపంలో ఆగిఉన్న ఓ టిప్పర్‌ను వెనకాల నుంచి బలంగా ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డాకుల: మండలంలోని ముత్యాలంపల్లి సమీపంలో రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు మహబూబ్‌నగర్ రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు. వివరాలు.. సుమారు 35నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి రైలుపట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తల భాగం తెగిపోయి ట్రాక్‌పై పడింది. మృతుడి వివరాలు, ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. రైలు పట్టాలపై మృతదేహం కనిపించడంతో స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ కోరారు.

6,810 క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 6,810 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,730, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 306, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 3.499మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. మంగళ వారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 861.8 అడుగుల వద్ద 111.6760టీఎంసీల నీటి నిల్వ ఉంది.

ఉత్సాహంగా నెట్‌బాల్ పోటీలు ప్రారంభం

- 26 జిల్లాల పురుష, మహిళా జట్లు హాజరు
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జట్ల శుభారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మంగళవారం రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా క్రీడా శాఖాధికారులు, క్రీడాకారులు, వివిధ క్రీడాసంఘాల ప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు విక్రం ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్, జిల్లా యోగా సంఘం కార్యదర్శి విలియం, జిల్లా కబడ్డీ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బాల్‌రాజు, వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జీ ఎస్.విజయ్‌కుమార్, డీఎస్ఏ సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, డీఎస్ఏ కోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మెయిన్ స్టేడియాన్ని సందర్శించి పలువురు క్రీడాజట్లను పరిచయం చేసుకున్నారు.

శుభారంభం చేసిన ఉమ్మడి జిల్లా జట్లు

నెట్‌బాల్ టోర్నీలో 26జిల్లాల నుంచి పురుషుల, మహిళా జట్లు పాల్గొన్నాయి. నాలుగు కోర్టుల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. తొలిరోజు నెట్‌బాల్ పోటీల్లో మహిళల విభాగంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జట్లు, పురుషుల విభాగంలో నారాయణపేట, నాగర్‌కర్నూల్ జట్లు శుభారంభం చేశాయి. మహబూబ్‌నగర్ జట్టు 19–12 పాయింట్ల తేడాతో జనగాం జట్టుపై, నాగర్‌కర్నూల్ జట్టు 11–6 తేడాతో నారాయణపేట జట్టుపై విజయాలు నమోదు చేసుకున్నాయి. మిగతా మహిళల మ్యాచుల్లో ఖమ్మం జట్టు 31–5 పాయింట్ల తేడాతో నిజామాబాద్ జట్టుపై, భద్రాద్రి కొత్తగూడెం జట్టు 10–1 తేడాతో ఆదిలాబాద్‌పై, వరంగల్ జట్టు 11–4 తేడాతో రాజన్న సిరిసిల్ల జట్టుపై, హన్మకొండ జట్టు 14–1 తేడాతో కరీంనగర్ జట్టుపై, జగిత్యాల జట్టు 16–5 తేడాతో మంచిర్యాల జట్టుపై, మేడ్చల్ జట్టు 31–7 తేడాతో హైదరాబాద్ జట్టుపై గెలుపొందాయి. పురుషుల విభాగంలో నారాయణపేట జట్టు 37–2 పాయింట్ల తేడాతో మంచిర్యాల జట్టుపై, నాగర్‌కర్నూల్ జట్టు 25–15 పాయింట్ల తేడాతో వరంగల్ జట్టుపై విజయం సాధించాయి. ఇతర మ్యాచుల్లో మహబూబాబాద్ జట్టు 24–6 తేడాతో వనపర్తి జట్టుపై, హైదరాబాద్ జట్టు 20–10 తేడాతో గద్వాల జట్టుపై, ఖమ్మం జట్టు 45–8 తేడాతో ఆదిలాబాద్ జట్టుపై, మేడ్చల్ జట్టు 10–27 తేడాతో కామారెడ్డి జట్టుపై, జనగాం జట్టు 16–5 తేడాతో ఆసిఫాబాద్ జట్టుపై, భద్రాద్రి కొత్తగూడెం జట్టు 10–1 తేడాతో రాజన్న సిరిసిల్ల జట్టుపై, హన్మకొండ జట్టు 8–5 తేడాతో జగిత్యాల జట్లపై గెలుపొందాయి. రాష్ట్ర స్థాయి సీఎం కప్ నెట్‌బాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ పురుషుల జట్టు జట్టు 20–6 పాయింట్ల తేడాతో జగిత్యాల జట్టుపై గెలుపొందింది.

పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం పోలీస్‌శాఖలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి ఉత్తమ సేవా పతకాలతో పాటు సేవా పతకాలను ప్రకటించింది. ప్రస్తుతం పతకాలు పొందిన సిబ్బందికి జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అందజేయనున్నారు. పతకాలు పొందినవారిని ఎస్పీ డి.జానకి అభినందించారు.

■ మహబూబ్‌నగర్ జిల్లాలో ఉత్తమ సేవా పతకం పొందిన వారిలో ఏఆర్ ఆర్ఎస్ఐ ఎండీ గయాసుద్దీన్, రాజాపూర్ ఏఎస్ఐ డి.లక్ష్మారెడ్డి, బాలానగర్ ఏఎస్ఐ అతీకుర్ ఉర్ రహ్మాన్, ఉమెన్ పీఎస్ ఏఎస్ఐ వనజారెడ్డి, ఇంటలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్స్ జి.రాజవర్ధన్‌రెడ్డి, జి.తిరుపతయ్య ఉన్నారు. సేవా పతకం పొందిన వారిలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, ఏఆర్ ఎస్ఐ దామోదర్, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ కె.విజయ్‌కుమార్, డీసీఆర్‌బీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్, ఇంటలిజెన్స్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్స్ శ్రీశైలం, దుర్గయ్య ఉన్నారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉత్తమ సేవా పతకం పొందిన వారిలో తిమ్మాజిపేట ఏఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు. నారాయణపేట జిల్లాలో డీఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ చంద్రప్ప, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి ఉన్నారు.

■ వనపర్తి జిల్లాలో సేవా పతకం పొందినవారిలో చిన్నంబావి ఏఎస్ఐ రమేష్, మదనాపురం ఉమెన్ ఏఎస్ఐ శివపార్వతి, వనపర్తి రూరల్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రాములు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ అబ్రహం, పెద్దమందడి కానిస్టేబుల్ వెంకటేశ్వరాచారి, ఏఆర్ కానిస్టేబుల్ సురేందర్‌గౌడ్, గద్వాల జిల్లాలో మల్దకల్ హెడ్‌కానిస్టేబుల్ పురేందర్, ట్రాఫిక్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, డీసీఆర్‌బీ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి, డీఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్, శాంతినగర్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామి గౌడ్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ తులసయ్యానాయక్ ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్స్ జి.ప్రభాకర్, రామచంద్రుడు, వి.సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, పర్వతాలు, నరేందర్‌గౌడ్, కల్వకుర్తి హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి, పీసీఆర్ కానిస్టేబుల్ శ్యామ్‌సుందర్, ఏఆర్ కానిస్టే బుల్స్ తిరుపతయ్య, ఆంజనేయులు, పి.రాములు ఉన్నారు. నారాయణపేట జిల్లాలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్స్ క్రిష్ణయ్య,ఆర్.శ్రీనివాస్, నర్సయ్య ఉన్నారు.

హైటెన్షన్ తీగలు దగ్ధం

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని గగ్గలపల్లి శివారులో ప్రమాదవశాత్తు హైటెన్షన్ విద్యుత్ తీగలు దగ్ధమైనట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాలు.. గగ్గలపల్లి శివారులో ఈనెల 29న జరిగిన అగ్నిప్రమాదంలో హైటెన్షన్ విద్యుత్‌లైన్‌ను ఏర్పాటుచేసేందుకు నిల్వఉంచిన తీగలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.5.50 కోట్ల నష్టం వాటిల్లింది. ఎల్అండ్‌టీ కంపెనీ మేనేజర్ కాంతారావు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

3న యూజీసీ నెట్ పరీక్ష నిర్వహణ

- కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జనవరి 3వ తేదీన యూజీసీ నెట్–2024 ఎగ్జామ్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించే ఈపరీక్షకు ఎం.వి.ఎస్. ఇన్ఫోటెక్ సర్వీసెస్, ఫాతియా విద్యాలయంను పరీక్ష కేంద్రంగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. నెట్ పరీక్షకు 185 మంది అభ్యర్థులు హాజరు అవుతారని అన్నారు. మొదటి షిఫ్ట్‌లో 91మంది, రెండో షిఫ్ట్‌లో 94 మంది పరీక్షలు రాస్తారన్నారు. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

నిలకడగా ఉల్లి ధర

- గరిష్టంగా రూ.3590
- కనిష్టంగా రూ.3150

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం ఉదయం జరిగిన బహిరంగ వేలంలో ఉల్లి ధర నిలకడగా ఉంది. గరిష్టంగా రూ.3590, కనిష్టంగా రూ.3150గా నమోదైంది. బుధవారం కొత్త సంవత్సరం సందర్భంగా మార్కెట్‌కు సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే ఉల్లిని వేలం వేశారు. గతవారం నమోదైన ధరలే ఈవారం నమోదయ్యాయి. మార్కెట్‌కు దాదాపు 200బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. వాటిని వేలం వేయగా స్థానిక వ్యాపారులతో పాటు బయటి నుంచి వచ్చిన వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కేజీలుగా తూకం వేసిన బస్తాలను గరిష్టంగా రూ.1800, కనిష్టంగా రూ. 1600గా విక్రయించారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్ల పరిశీలన



ఎస్వీకేఎం పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

జడ్చర్ల టౌన్: జనవరి 7, 8, 9 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జడ్చర్లలోని నిర్వహించనున్నారు. మంగళవారం ఎస్వీకేఎం పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను ఎస్ఈఆర్‌టీ సంచాలకులు రమేష్, ఆర్‌జేడీ విజయలక్ష్మి, డీఈఓ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. అక్కడ విద్యార్థుల ప్రదర్శనలను ప్రదర్శించే స్థలాలు, భోజనవసతి, మరుగుదొడ్లు, రాత్రిబస అంశాలను ఆరాతీశారు. ఏర్పాట్లు బాగున్నాయని వారు సంతృప్తి వ్యక్తంచేశారు. వారివెంట ఎస్ఈఆర్‌టీ ప్రొఫెసర్ సురేష్ బాబు, సమగ్ర శిక్ష సీఎంఓ బాలుయాదవ్, జిల్లా సైన్స్‌అధికారి శ్రీనివాస్, జీహెచ్‌ఎం రవీందర్‌గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎబ్నీజర్ ఉన్నారు.

ఒక్కరోజే రూ.12.60కోట్ల మద్యం అమ్మకాలు



తిమ్మాజిపేటలో రాత్రి మద్యం లోడ్ చేస్తున్న డిపో కార్మికులు

తిమ్మాజిపేట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు మద్యం సరఫరా చేసే ఏకైక మద్యం డిపో ద్వారా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. కొత్తసంవత్సర వేడుకల సందర్భంగా రూ.12.60కోట్ల విలువ గల మద్యం తాగేసి రికార్డు సృష్టించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని మద్యండిపో ద్వారా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 120 మద్యం దుకాలకు మద్యం సరాఫరా చేస్తున్నారు. డిసెంబర్ 31న 11,400లిక్కర్ కేసుల అమ్మకాలు, 18,401 కేసుల బీర్ అమ్మకాలు జరిగినట్లు డిపో మేనేజర్ సయ్యద్ అబ్దుల్‌వాసే తెలిపారు. ఏప్రిల్ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు తొమ్మిది నెలలో లిక్కర్ 14లక్షల 19వేల కేస్‌లు, బీర్ 21లక్షల 18వేలు కేస్‌ల నిలువ 1300 కోట్ల అమ్మకాలు జరిగినట్లు డిపో అధికారులు ఏడాది పూర్తయ్యేందుకు మరో మూడు నెలల ముందుగానే రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి.

మత్స్యశాఖ అధికారుల దాడులు



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోలు, మంచాలకట్ట, మల్లేశ్వరంలోని కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో అలవి వలలతో చేపలను పడుతుండటంతో మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్యశాఖ అధికారులు కొల్లాపూర్ పర్యవేక్షణ అధికారి గంగాధర్, పెంట్లవెల్లి పోలీసుల సమక్షంలో దాడులు నిర్వహించారు. ఎప్పటిలాగే తూ తూమంత్రంగా రావడం, పోవడం జరిగిందని మత్స్యకారులు వాపోతున్నారు. పేరుకే దాడులు నిర్వహిస్తున్నారని.. ఒక్క వలను కూడా పట్టుకున్న పరిస్థితి లేదని తెలిపారు. అధికారులు ఇలా వచ్చి అలా వెళ్లేసరికి యథావిధిగా అలివి వలతో చేపలు పడుతున్నారని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆలయంలో గుండెపోటుతో వ్యక్తి మృతి



మృతుడు మాణిక్ ప్రభు

అలంపూర్ : అలంపూర్ క్షేత్ర ఆలయాల సముదాయంలోని పరిసరాల్లో హైదరాబాద్‌కు చెందిన మాణిక్‌ప్రభు(58) అనే వ్యక్తి గుండెపోటుతో మంగళవారం మృతిచెందినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. వివరాలు.. హైదరాబాద్‌లోని ఉప్పుగుడాకు చెందిన మాణిక్‌ప్రభు, తల్లి విమలబాయ్‌తో కలిసి సోమవారం అలంపూర్ క్షేత్ర ఆలయాలకు వచ్చారు. ఆలయాలను దర్శించుకొని అమావాస్య కావడంతో ఆలయాల పరిసరాల్లో రాత్రి నిద్రించాడు. తెల్లవారుజామున తల్లి మాణిక్‌ప్రభువును లేపగా కదలకపోవడంతో చుట్టుపక్కల వారు అతడిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మాణిక్‌ప్రభు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి విమలబాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య జ్యోతి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుంటలో పడి రైతు మృతి



సున్నావత్ రాజు (ఫైల్)

గోపాల్‌పేట: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి ఓరైతు మృతి చెందిన ఘటన కర్ణమయ్యకుంటతండాలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు.. కర్ణమయ్యకుంటతండాకు చెందిన సున్నావత్ రాజు(39) భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. వారి పిల్లలు హాస్టల్‌లో చదువుకుంటున్నారు. గ్రామంలో ఉన్న పొలంలో వరి సాగు చేసుకునేందుకు వారం రోజులక్రితం అతడు గ్రామానికొచ్చాడు. సోమవారం సాయంత్రం రాజు తిమ్మాయికుంటతండావద్ద పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు తిమ్మాయికుంటలో పడ్డాడు. మంగళవారం కుంటలో వెతికి మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత

పాలమూరు: జడ్చర్లలోని సత్యేశ్వర ఆశ్రమంలో మంగళవారం అనారోగ్యంతో మృతిచెందిన గొల్ల భీమమ్మ(78) మృతదేహాన్ని పాలమూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించారు. వైద్య కళాశాల విద్యార్థులకు ల్యాబ్‌లో ఉపయోగంకోసం మృతదేహాన్ని కళాశాల అనాటమి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పరిమళకు అప్పగించారు. ఈసందర్భంగా మృతదేహానికి ఎంబీబీఎస్ ఫస్ట్‌ియర్ విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు రామకృష్ణ, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద గంజాయి కలకలం

- 7మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

అలంపూర్ : జాతీయరహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద గంజాయి కలకలం రేగింది. కొంత మంది యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు. రోజంతా విచారణ కొనసాగడంతో హడావుడి నెలకొంది. ఈసంఘటనకు సంబంధించి ఉండవెల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్, ఉండవెల్లి పోలీస్‌లు పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద సోమవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో రాత్రి 12గంటల సమయంలో టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న ఒక టీం దుకాణం సమీపంలో 7మంది యువకులు కూర్చొని ఉన్నట్లు సమాచారం అందింది. అక్కడికెళ్లిన పోలీసులకు ఆయువకులపై అనుమానం వచ్చింది. వివరాలు సేకరిస్తుండగా వారి నుంచి మత్తువాసన వస్తున్నట్లు గుర్తించారు. అందులో ఒక వ్యక్తి గంజాయి తాగుతున్నట్లు పేర్కొన్నాడు. వారి వివరాలు సేకరించగా హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ సల్మాన్ ఫైజల్, అక్షయ్ హోల్కుండే, మహ్మద్ సాద్, మైనం దర్వేష్, పరివారిష్ అలీ ఖాన్, దొడ్డే సాయిరాం, సైఫ్ బిన్, ఖాలిద్ అహ్మద్ తౌఫిక్‌గా గుర్తించారు. వీరంతా రెండు కార్లలో వచ్చినట్లు తెలిపారు. ఆకార్లను తనిఖీచేయగా అందులో 18.30గ్రాముల గంజాయి లభించింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.500వరకు ఉంటుందని తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు.

రోజంతా హడావుడి

ఉండవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోజంతా హడావుడి కొనసాగింది. హైదరబాద్ నార్కోటిక్ పోలీసుల సమాచారం మేరకు ఉండవెల్లి పోలీసులు రాత్రి తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ఈ క్రమంలో టోల్‌ప్లాజా వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు తెలిసింది. అందులో భాగంగా పోలీసులు వచ్చిన వాహనాలను క్షుణ్ణంగా తనిఖీచేశారు. టోల్‌ప్లాజా వద్ద కొంతసేపు ట్రాఫిక్ సమస్య నెలకొందని స్థానికులు చెప్పారు.

ఎందుకు అంత హంగామా

పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన గంజాయి చాలా తక్కువ మోతాదులోనే ఉంది. పట్టుబడిన గంజాయి విలువ రూ.500 లోపు ఉంటుందని చెబుతున్నారు. అయినప్పటికీ 24 గంటల పాటు ఎందుకు ఇంత హంగామా చేశారో అంతు చిక్కని విషయంగా మారింది. పట్టుబడిన నిందితుల రక్తన మూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్లు ఒక పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. పోలీసులు ఈ సంఘటన గురించి పూర్తి సమాచారం వెల్లడిస్తేనే వివరాలు వెలుగులోకి వస్తాయి.

20 గంటలకుపైగా విచారణ

టోల్‌ప్లాజా వద్ద పట్టుబడిన వారిని 20గంటలకు పైగా పోలీసులు విచారించారు. వారిని ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలుస్తుంది. మంగళవారం ఉదయం మరో పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేసినట్లు చర్చ జరుగుతుంది. చివరగా టోల్‌ప్లాజా వద్దకు వారిని తీసుకెళ్లి పోలీసులు విచారించారు. పోలీసులు అక్కడికి మీడియాకు సైతం అనుమతించలేదు. దీంతో రాత్రి నుంచి ఉదయం వరకు ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి. ఈ హైడ్రామా అనంతరం రాత్రి పోలీసుల మీడియాకు ప్రెస్ నోట్ విడదలచేశారు. రోజంతా విచారణ చేయడంతో పెద్ద మొత్తంలోనే గంజాయి లభించిందనే చర్చ జోరుగా సాగింది. ఎక్కడ ఇద్దరు కలిసినా ఈవిషయంపై చర్చించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

■ " House for Sale " 180sqyd East Facing at Raghavendra Colony Jedcharla M 9886154400

SERVICES

BUSINESS OFFER

■మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి. లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర: 8376001873, 96430 10487, 8376089771, 011-25920179

WANTED

■ రియల్ ఎస్టేట్ Co. HYD, కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe.జీ+కమీషన్+2వీలర్+రూం+భో ఫ్రీ. Age : 30, నె. లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781

భవిత విద్యార్థుల కోసం

గమనిక

- సాక్షి మేనేజర్







